TGTEL/25/A0871

# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక :351 27-06- 2026 శనివారం పేజీలు: 4 వెల:03/-




# ముప్పైమూడు గేట్లతో మూడు రాష్ట్రాల జలవివాదాలకు మోక్షం!

– తుంగభద్ర సాక్షిగా చారిత్రాత్మక అడుగు; వేదికగా నిలిచిన బళ్లారి

– ఆర్డీఎస్ కింద పాలమూరు వాటా 15.9 టీఎంసీలు దక్కాల్సిందే: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

– రాజకీయాలకు అతీతంగా రైతుల కోసం ఏకమైన ముగ్గురు ముఖ్యమంత్రులు

హోస్పేట/బళ్లారి, (తెలంగాణ వెన్నెల వాక్కు):
దశాబ్దాలుగా నలుగుతున్న అంతరాష్ట్ర జలవివాదాల పరిష్కారానికి తుంగభద్ర నది ఒడ్డున ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కర్ణాటకలోని హోస్పేట వద్ద ప్రతిష్టాత్మక తుంగభద్ర ప్రాజెక్టుకు నూతనంగా పునరుద్ధరించిన 33 గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ అరుదైన వేదికపై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ. రేవంత్ రెడ్డి (తెలంగాణ), నారా చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), డి.కె. శివకుమార్ (కర్ణాటక ఉప ముఖ్యమంత్రి)లతో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఒకే వేదికపైకి రావడం విశేషం. రాజకీయాలకు అతీతంగా కేవలం రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా జరిగిన ఈ భేటీ, కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ జలాల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఒక గొప్ప నిర్ణయానికి నాంది పలికింది.

పాలమూరుకు న్యాయం చేయండి: సీఎం రేవంత్ రెడ్డి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పరిధిలో గద్వాల్, అలంపూర్, పాలమూరు ప్రాంతాల రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు కేటాయించిన 15.9 టీఎంసీల నీటిలో ప్రస్తుతం కేవలం 5 టీఎంసీలను మాత్రమే వాడుకోగలుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్రలో భారీగా పేరుకుపోయిన పూడిక, నీటి తరలింపులో ఉన్న సాంకేతిక లోపాల వల్ల మిగిలిన 10 టీఎంసీల నీరు అందక లక్షలాది మంది రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ సమస్యను కేంద్ర మంత్రి సీఆర్

2

# తెలంగాణలో మరో 7 రోజులు భారీ వర్షాలు

ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో రాష్ట్రానికి వాతావరణ శాఖ హెచ్చరిక



హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ రాష్ట్రంలో మరో వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న ఏడు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. అదే విధంగా దక్షిణ తెలంగాణలో నారాయణపేట, గద్వాల జిల్లాలకు కూడా భారీ వర్ష సూచనలు జారీ చేసింది.

వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పిడుగులు పడే అవకాశాలు కూడా ఉన్నందున రైతులు, వ్యవసాయ కూలీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరం లేకుండా వర్ష సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడవద్దని హెచ్చరించారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తుండటంతో నదులు, వాగులు, చెరువుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున స్థానిక సంస్థలు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలను అప్రమత్తంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచనలు జారీ అయ్యాయి.

2

# ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలకు ఊరట

## జీవో నెం.9 అమలుపై మధ్యంతర స్టే..

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెం.9పై తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవోలో పేర్కొన్న మార్గదర్శకాల అమలుపై మధ్యంతర స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలకు ఊరట కలిగించింది. జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం ఈ మేరకు విచారణ జరిపి స్టే ఆదేశాలు జారీ చేసింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు విద్యాసంస్థల ఆర్థిక నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందంటూ పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. జీవోలోని కొన్ని నిబంధనలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటి వల్ల విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం జీవో

2

# 9వ తరగతి పాఠ్యాంశంగా ఎమర్జెన్సీ చరిత్ర

కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించిన బీజేపీ




హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పద రాజకీయ పరిణామంగా గుర్తింపు పొందిన 1975 ఎమర్జెన్సీ అంశాన్ని 9వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యాంశంలో చేర్చడాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతించింది. ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంలో ఈ నిర్ణయం కీలకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు దేశ రాజకీయ చరిత్రపై సరైన అవగాహన కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

1975 జూన్ 25న అప్పటి

2

# భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు

## ప్రధాని మోడీతో సీఈఓ ఆండీ జస్సీ కీలక భేటీ



న్యూఢిల్లీ బ్యూరో
ప్రపంచ ఈ-కామర్స్ దిగ్గజం ‘అమెజాన్’ భారతదేశంలో పెట్టుబడుల విస్తరణకు సరికొత్త మైలురాయిని నిర్దేశించింది. అమెజాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జజూ) ఆండీ జస్సీ న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఐదేళ్లలో (2026–2030 మధ్య) భారత్‌లో ఏకంగా 48 బిలియన్ డాలర్ల

2

## ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూసేకరణ వేగవంతం చేయాలి



ముధోల్, జూన్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలో దాదాపు 200 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం భూసేకరణ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులతో సమగ్రంగా చర్చించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా నియోజకవర్గ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ విద్యాసంస్థ నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు మరింత విస్తృతమవడంతో పాటు ముధోల్ నియోజకవర్గం విద్యారంగంలో కొత్త మైలురాయిని చేరుకుంటుందని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీ సతీష్ రెడ్డి, సీనియర్ నాయకుడు సుదర్శన్, మండల నాయకులు పాల్గొన్నారు.

## జలవివాదాలకు మోక్షం!

పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించానని, సాగునీటి సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల విలువైన జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నాయని పేర్కొన్నారు.

మూడు తరాల సమస్యకు ముగింపు

ఈ ప్రాంత రైతుల మేలు కోసం నాడు మైసూరు మహారాజు, హైదరాబాద్ నిజాం నవాబు కలిసి తుంగభద్ర డ్యామ్‌ను నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. రాజ్యాలు విస్తరించుకునే నాటి రాజులే రైతుల కోసం అంత గొప్పగా ఆలోచిస్తే, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా తాము మరింత బాధ్యతతో అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. ఈ 33 గేట్ల పునరుద్ధరణ అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదని, బళ్లారి, అనంతపూర్, కర్నూలు, పాలమూరు జిల్లాలకు చెందిన మూడు తరాల రైతుల కష్టాలకు ఇది శాశ్వత ముగింపు పలకబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. డి.కె. శివకుమార్ ఆహ్వానం మేరకు తామంతా ఒకే తాటిపైకి వచ్చామని, తుంగభద్ర సాక్షిగా జరిగిన చర్చలు సత్ఫలితాలను ఇచ్చాయని, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఈ సమస్యలన్నింటికీ త్వరలోనే పూర్తిస్థాయి పరిష్కారం చూపుతారనే సంపూర్ణ విశ్వాసం తనకు ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణలో మరో 7 రోజులు భారీ వర్షాలు

వ్యవసాయ రంగానికి ఈ వర్షాలు ప్రయోజనకరంగా మారనున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ సాగు పనులు వేగవంతమయ్యే అవకాశం ఉందని, వరి, పత్తి, సోయాబీన్ తదితర పంటలకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే అధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. విపత్తు నిర్వహణ బృందాలు, విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులను ప్రజలు నిరంతరం గమనించాలని, అధికారుల సూచనలను పాటించాలని వాతావరణ శాఖ విజ్ఞప్తి చేసింది. భారీ వర్షాల కారణంగా రవాణా, విద్యుత్ సరఫరా వంటి సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రంలో వర్షాల ప్రభావం జూన్ నెలాఖరు వరకు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## జీవో నెం.9 అమలుపై మధ్యంతర స్టే..

నెం. 9లోని మార్గదర్శకాలపై ప్రాథమికంగా అభ్యంతరాలు ఉన్నట్లు గుర్తించింది. పూర్తి స్థాయి విచారణ పూర్తయ్యే వరకు జీవో అమలును నిలిపివేయాల్సిన అవసరం ఉందని భావించి మధ్యంతర స్టే మంజూరు చేసింది. కోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులు వచ్చే మంగళవారం వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన కీలక సంక్షేమ కార్యక్రమంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుకునేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. అయితే నిధుల విడుదల, ఫీజుల చెల్లింపులు, కొత్త మార్గదర్శకాల అంశాలపై గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి.

హైకోర్టు తాజా నిర్ణయంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తాత్కాలిక ఉపశమనం పొందినప్పటికీ, తుది తీర్పుపై అందరి దృష్టి నెలకొంది. ప్రభుత్వం తరఫున కూడా జీవో జారీ వెనుక ఉన్న ఉద్దేశాలను కోర్టు ముందు వివరించే అవకాశం ఉంది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విద్యా వర్గాలు కోరుతున్నాయి.

రాష్ట్ర ఉన్నత విద్యా రంగంపై ప్రభావం చూపే ఈ అంశంలో హైకోర్టు తదుపరి విచారణ కీలకంగా మారనుంది. మంగళవారం జరిగే విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై కూడా ఈ కేసు ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దేవుడి సొమ్ముపై ఆశ!

## అయోధ్య ట్రస్ట్‌లో అక్రమాలపై 'సీట్' నివేదికతో రేగుతున్న రాజకీయ దుమారం

భారతదేశ చరిత్రలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల శతాబ్దాల నిరీక్షణకు, పరమ పవిత్ర భావోద్వేగాలకు ప్రతీక అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరం. దేశంలోని మారుమూల గ్రామంలోని ఒక సామాన్య పేదవాడి నుండి అత్యంత సంపన్నుల వరకు ప్రతి ఒక్కరూ తమ శక్త్యానుసారం రూపాయి, రెండు రూపాయల చొప్పున సమర్పించిన విరాళాలతో, చెమటోడ్చి దాచుకున్న సొమ్ముతో ఈ భవ్య మందిర నిర్మాణం సాకారమైంది. అయితే, అటువంటి పవిత్రమైన రాముడి నిధుల నిర్వహణపై, హుండీ కానుకలపై అవినీతి నీడలు కమ్ముకోవడం, అక్రమాలు జరిగాయంటూ ప్రత్యేక దర్యాప్తు బృందం ఏకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సిఫార్సు చేయడం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. ఆలయ ట్రస్ట్‌కు చెందిన సీనియర్ పదాధికారులతో సహా మొత్తం 17 మందిని నిందితులుగా పేర్కొంటూ, హుండీల తాళాలు ఒకే ఒక ఉద్యోగి వద్ద ఉంచి విరాళాలను దుర్వినియోగం చేశారనే బలమైన ఆధారాలు లభించాయని 'సీట్' నివేదించడం భక్తుల అమాయక నమ్మకాన్ని నట్టేట ముంచేలా ఉంది.

**ఎఫ్ఐఆర్ నమోదుకు 'సీట్' సిఫార్సు: అంతర్యం ఏంటి?**

ప్రత్యేక దర్యాప్తు బృందం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరడం వెనుక ఉన్న ప్రధాన అంతర్యం సాంకేతిక, చట్టపరమైన ఆధారాలు ప్రాథమికంగా బలంగా లభించడమేనని స్పష్టమవుతోంది. సాధారణంగా కేవలం రాజకీయ ఆరోపణల ఆధారంగా లేదా ఎలాంటి సాక్ష్యాలు లేకుండా దర్యాప్తు సంస్థలు ఎఫ్ఐఆర్‌కు సిఫార్సు చేయవు. విరాళాల సేకరణ, రశీదుల జారీ, బ్యాంకు డిపాజిట్లు, మరియు ప్రతిరోజూ వచ్చే హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియలో వ్యవస్థాగతమైన లోపాలు మరియు ఉద్దేశపూర్వక అక్రమాలు జరిగినట్లు దర్యాప్తులో ప్రాథమిక ఆధారాలు లభించాయి. ముఖ్యంగా, దేవాలయాల్లో అత్యంత పవిత్రంగా, భద్రంగా ఉండాల్సిన హుండీల తాళాలు ఒక సాధారణ ఉద్యోగి గుప్పిట్లో ఉంచడం అనేది ఒక పెద్ద కుట్రకు లేదా ఘోరమైన నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఎవరి నిఘా లేకుండా, పటిష్టమైన ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయకుండా నిధులను దారిమళ్లించేందుకే ఈ విధమైన లొసుగులను సృష్టించారా అనే అనుమానాలకు



'సీట్' నివేదిక బలాన్ని చేకూరుస్తోంది. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యంపై, దర్యాప్తు వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుందనే ఉద్దేశంతోనే 'సీట్' ఈ కఠిన నిర్ణయానికి సిఫార్సు చేసింది.

**నిజంగా అవినీతి జరిగిందా? చట్టం ముందు సమానులెవరు?**

ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉంది. కోర్టులో ఆరోపణలు నిరూపితమయ్యే వరకు నిందితులుగా పేర్కొన్న వారిని దోషులుగా పరిగణించలేము. కానీ, 'పొగ లేనిదే మంట పుట్టదు' అన్న చందంగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత ఉన్న ఒక ఆలయ ట్రస్ట్‌లో ఈ స్థాయి అక్రమాలపై ఆధారాలు లభించాయంటే అక్కడ పారదర్శకత పూర్తిగా లోపించిందని అర్థమవుతోంది. గతంలో భూముల కొనుగోలు వ్యవహారంలోనూ ఐదు నిమిషాల వ్యవధిలో ధరలు కోట్లాది రూపాయలకు పెరగడంపై ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు నేరుగా హుండీ నిధుల నిర్వహణలోనే అవకతవకలు జరిగాయని ప్రభుత్వ అధికారిక దర్యాప్తు సంస్థే చెప్తుండటం గమనార్హం. దేవుడి సొమ్ముపై ఆశపడే మనస్తత్వం సమాజంలో ఏ స్థాయిలో వేళ్లూనుకుందో ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఒకవేళ విచారణలో ఈ 17 మందిపై ఆరోపణలు నిజమని తేలితే, అది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, కోట్లాది మంది భక్తుల నమ్మకంపై జరిగిన అతిపెద్ద ద్రోహం అవుతుంది. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, దేవుడి పేరిట పదవులు అనుభవిస్తున్న వారైనా సరే తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే.

దేవుడి విరాళాల దోపిడీ.. ఇదేనా హిందుత్వం?

ఈ వివాదం సనాతన ధర్మం మరియు హిందుత్వ సిద్ధాంతాల మౌలిక స్వరూపంపైనే కొన్ని తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. 'రామరాజ్యం' అంటే ధర్మం, న్యాయం, నిష్కలంకమైన పారదర్శకతకు నిదర్శనం. సాక్షాత్తూ ఆ రాముడి ఆలయ నిధులనే స్వాహా చేయడానికి ప్రయత్నించడం ఏ రకమైన హిందుత్వం? నిజమైన హిందుత్వం ఎప్పుడూ స్వార్థాన్ని, అవినీతిని, దేవుడి పేరుతో దోపిడీ చేయడాన్ని సమర్థించదు. ధర్మాన్ని రక్షించడమే హిందుత్వం యొక్క పరమార్థం అయితే, అధర్మానికి పాల్పడేవారు ఏ పదవిలో ఉన్నా, ఎంతటి వీరభక్తులమని చెప్పుకున్నా వారిని శిక్షించడమే అసలైన రాజధర్మం. దేవుడిని మరియు భక్తిని కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత సంపాదనకు, రాజకీయ ప్రయోజనాలకు పెట్టుబడిగా మార్చుకుంటున్నారనే విమర్శలకు ఇలాంటి ఘటనలు మరింత ఊతమిస్తున్నాయి. మతాన్ని, భక్తిని వ్యాపారంగా మార్చే శక్తుల పట్ల హిందూ సమాజం కూడా అప్రమత్తంగా ఉండాలి.

**నమ్మకం అనే పునాదిపై దెబ్బ..**

భారతదేశంలో ఆలయాల నిర్వహణ అనేది కేవలం ఒక పరిపాలనా పరమైన అంశం కాదు. అది భక్తుల సెంటిమెంట్లతో, నమ్మకాలతో ముడిపడి ఉన్న వ్యవహారం. రామమందిరం కోసం తమ సొంత ఇళ్లను, ఆస్తులను అమ్ముకుని విరాళాలు ఇచ్చిన అభాగ్యులు ఎందరో ఉన్నారు. పాఠశాల పిల్లలు తమ పాకెట్ మనీని సైతం రాముడి సేవ కోసం పంపించారు. అటువంటి పవిత్రమైన సొమ్మును కొందరు స్వార్థపరులు తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నారనే వార్తలు సమాజంలో తీవ్ర ఆవేదనను నింపుతున్నాయి. ఒకవైపు ఆలయాల పవిత్రత గురించి ప్రసంగాలు చేస్తూ, మరోవైపు ఆలయ నిధులను దారిమళ్లించడం ముమ్మాటికీ క్షమించరాని నేరం. ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

**పారదర్శకత కోసం తక్షణ సంస్కరణలు అవసరం**

ఈ సంక్షోభం నుండి ఆలయ పవిత్రతను కాపాడటానికి 'సీట్' ఇచ్చిన సూచనలు అత్యంత కీలకమైనవి. రామమందిర ట్రస్ట్‌ను తక్షణమే పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలతో ముడిపడి ఉన్న శక్తులను తక్షణమే పక్కన పెట్టి, పరిపాలనా పారదర్శకతను పెంచేందుకు ఒక సీనియర్, నిష్పక్షపాత ప్రభుత్వ ఐఏఎస్ అధికారిని పూర్తిస్థాయి నిర్వాహకుడిగా నియమించాలి. ఆలయానికి వచ్చే ప్రతి పైసా, ప్రతి విరాళం డిజిటల్ రూపంలో ఆడిటింగ్ జరగాలి. భక్తుల కానుకలకు పూర్తి జవాబుదారీతనం ఉండాలి. చట్టం తన పని తాను చేసుకుంటూ పోయి, ఈ విరాళాల దుర్వినియోగం వెనుక ఉన్న అసలు సూత్రధారులను, పాత్రధారులను సమాజం ముందు నిలబెట్టాలి. రాముడి పేరుతో అక్రమాలకు పాల్పడిన వారికి కఠిన శిక్ష పడినప్పుడే, అయోధ్య మందిర పవిత్రతకు, కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లకు నిజమైన న్యాయం జరుగుతుంది. లేనిపక్షంలో భక్తి శ్రద్ధల వెనుక జరిగే ఇటువంటి అవినీతి పర్వాలు సమాజ పురోగతికే పెద్ద ముప్పుగా మారుతాయి.




వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863


## 9వ తరగతి పాఠ్యాంశంగా ఎమర్జెన్సీ చరిత్ర

ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన విషయం భారత రాజకీయ చరిత్రలో కీలక అధ్యాయంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు, రాజకీయ నాయకుల అరెస్టులు, పౌర హక్కుల పరిమితి వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై వాటి ప్రభావాన్ని విద్యార్థులు తెలుసుకోవడం అవసరమన్నారు.

దేశ యువత చరిత్రలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను తెలుసుకోవడం ద్వారా రాజ్యాంగ విలువలను మరింతగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. చరిత్రను వాస్తవాల ఆధారంగా బోధించడం ద్వారా భవిష్యత్ తరాలు ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ పాత్రను గుర్తించగలవని తెలిపారు.

విద్యా నిపుణులు కూడా విద్యార్థులకు చరిత్రలోని అన్ని కోణాలను పరిచయం చేయడం అవసరమని సూచిస్తున్నారు. మంచి, చెడు పరిణామాలను సమగ్రంగా అధ్యయనం చేయడం ద్వారా సమాజంపై అవగాహన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసినప్పటికీ, విద్యార్థుల్లో చారిత్రక అవగాహన పెంపొందించడంలో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

## ప్రధాని మోడీతో సీఈఓ ఆండీ జస్సీ కీలక భేటీ

(సుమారు ?4 లక్షల కోట్లకు పైగా) భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెజాన్ అధికారికంగా ప్రకటించింది. గతంలో ప్రకటించిన బడ్జెట్‌కు అదనంగా మరో 13 బిలియన్ డాలర్లను జత చేస్తూ ఈ రికార్డు స్థాయి పెట్టుబడి ప్రణాళికను సంస్థ వెల్లడించింది.

యువతకు ఉపాధి – సాంకేతిక పురోగతి

ఈ మెగా పెట్టుబడుల ద్వారా దేశంలోని ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఈ–కామర్స్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ూఔ) క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 21 బిలియన్ డాలర్లకు పైగా నిధులను కేటాయించనున్నారు. ముంబై, హైదరాబాద్ వంటి నగరాల్లో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచడం ద్వారా స్థానిక స్టార్టప్‌లకు, ప్రభుత్వ సంస్థలకు సరికొత్త సాంకేతికత అందుబాటులోకి రానుంది.

ఈ భేటీ అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం 'ఞ' ద్వారా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "అమెజాన్ సీఈఓ ఆండీ జస్సీతో సమావేశం అద్భుతంగా సాగింది. భారత్‌లో అమెజాన్ ప్రకటించిన 48 బిలియన్ డాలర్ల రికార్డు పెట్టుబడులను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను. ఈ భారీ పెట్టుబడుల వల్ల మన దేశ యువతకు అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అదే సమయంలో, భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని, నమ్మకాన్ని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది" అని మోడీ పేర్కొన్నారు.

చిన్న వ్యాపారులకు అండగా..

భారతదేశ ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగానే అమెజాన్ వ్యూహాలు ఉంటాయని ఆండీ జస్సీ స్పష్టం చేశారు. డిజిటల్ విప్లవంలో భాగంగా దేశంలోని సుమారు 1.5 కోట్ల చిన్న వ్యాపారాలను (మీవీజు) బలోపేతం చేయడమే కాకుండా, ఈ–కామర్స్ ద్వారా దాదాపు 80 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు ఏఐ (ూ×) విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

ఈ భారీ పెట్టుబడులతో 2030 నాటికి దేశంలో దాదాపు 38 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అమెజాన్ వెల్లడించింది. ఈ–కామర్స్ నెట్‌వర్క్‌తో పాటు దేశవ్యాప్తంగా క్విక్ కామర్స్ సేవలను 300 పైగా నగరాలకు విస్తరించడం, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలలో కొత్తగా డెలివరీ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ప్రధాని మోడీ 'ఆత్మనిర్భర్ భారత్' విజన్‌కు భాగస్వామిగా ఉంటూ, భారతదేశ దీర్ఘకాలిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తామని అమెజాన్ సీఈఓ పునరుద్ఘాటించారు.



# వ్యవస్థల నీడలో అవినీతి కోరలు..మరిచిన 'రాజధర్మం'!

## గ్రంథాల నిండా నీతులు... గద్దెల నిండా నేరాలు!

# వ్యవస్థీకృత అవినీతిపై 'రాజధర్మ' అస్త్రం



భారతదేశంలో లంచం అనేది ఇప్పుడు ఒక సంచలన వార్త కాదు; అది ఒక సామాజిక జీవన విధానం. ఒక సామాన్య రైతు భూమి పత్రాల కోసమో, ఒక పేద విధవరాలు తన పింఛను కోసమో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేటప్పుడు ఎదురయ్యే అలిఖిత 'లంచం టారిఫ్' మనల్ని కదిలించడం మానేసింది. అవినీతిని మనం మార్చలేని ఒక వాతావరణంలా, భరించక తప్పని ఒక శాపంగా స్వీకరిస్తూ రాజీపడిపోతున్నాం. ఈ నైతిక పతనానికి కారణం---మనం వ్యవస్థలను నిర్మిస్తున్నాం కానీ, ఆ వ్యవస్థలను నడిపించాల్సిన 'ధర్మాన్ని' విస్మరిస్తున్నాం.

అవినీతి నిర్మూలన అంటే కేవలం వేదికలపై ఉపన్యాసాలు దంచడం, లేదా అవినీతి నిరోధక దినోత్సవాల్లో ప్రతిజ్ఞలు చేయించడం కాదు. అలాగే, ఒక విభాగాన్ని నిఘా పెట్టడానికి మరొక విభాగాన్ని, ఒక వెబ్‌సైట్‌ను తనిఖీ చేయడానికి ఇంకొక పోర్టల్‌ను సృష్టించడం కూడా శాశ్వత పరిష్కారం కాదని చరిత్ర రుజువు చేస్తోంది. సరైన అంతర్గత నైతికత, భయం లేని చోట ఏ ఉన్నత వ్యవస్థ అయినా కేవలం ఒక ఆచారంగా మారిపోతుంది; కాలక్రమేణా ఆ వ్యవస్థలు కూడా లంచాల అడ్డాగా మారుతాయనడంలో సందేహం లేదు.

ఈ రోజు మన దేశానికి కావాల్సింది ఆదర్శవాదం కాదు, కఠినమైన 'వాస్తవికవాదం'. ఇరవై మూడు శతాబ్దాల క్రితమే కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఈ మానవ నైజాన్ని అత్యంత స్పష్టంగా ఆవిష్కరించారు. "నాలుక చివరి భాగంలో ఉన్న తేనెను రుచి చూడకుండా ఉండటం ఎంత అసాధ్యమో, ప్రభుత్వ సొమ్మును నిర్వహించే అధికారి కొంచెమైనా ఆశించకుండా ఉండటం అంత అసాధ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఆయన అధికారులను యోగ్యులని భ్రమపడలేదు; ఖజానాను కొల్లగొట్టే 40 రకాల మార్గాలను ముందే ఊహించి, నిరంతర నిఘా, అధికారుల బదిలీ, కఠిన శిక్షలు అనే ఆచరణాత్మక వైద్యం సూచించారు.

ప్రాచీన భారతీయ చింతనలో 'రాజకీయం' అంటే ఒక హక్కుగానో, భోగంగానో భావించలేదు; అది కేవలం ప్రజాసేవ కోసం అప్పగించబడిన ఒక పరమ పవిత్రమైన బాధ్యత. మహాభారతంలోని శాంతి పర్వంలో భీష్ముడు చెప్పినట్లు---ప్రజలను రక్షించే పాలకుడు వారి పుణ్యంలో భాగస్వామి అయితే, రక్షించడంలో విఫలమైనవాడు వారి పాపాలను, కష్టాలను మోయాల్సి వస్తుంది. రెండు వేల ఏళ్ల క్రితమే తమిళ మహాకవి తిరువళ్ళువర్ తన తిరుక్కురల్ లో చెప్పిన మాట నేటికీ అక్షరసత్యం: "చేతిలో రాజదండం పట్టుకుని లంచాలు లాగే పాలకుడు, దారిదోపిడీ చేస్తూ ఈటెతో బెదిరించే దొంగ ఇద్దరూ ఒక్కటే".

కానీ నేటి వాస్తవ చిత్రం మరీ ఆందోళనకరంగా ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 543 మంది ప్రజాప్రతినిధులలో దాదాపు సగం మంది (251 మంది) తమపై నేరారోపణలు ఉన్నట్లు స్వయంగా ప్రకటించుకున్నవారే. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వారి 2025 అవినీతి సూచీలో 182 దేశాల జాబితాలో భారతదేశం 91వ స్థానంలో నిలిచి, ప్రపంచ సగటు కంటే వెనుకబడిపోవడం మన పాలనా లోపానికి అద్దం పడుతోంది.

మనం ఎన్నికల్లో గెలవడాన్ని ఒక అధికార వైభవంగా కాకుండా, ప్రజలకు తీర్చాల్సిన ఒక రుణంగా భావించినప్పుడే ఈ వ్యవస్థలో మార్పు సాధ్యమవుతుంది. నాయకులు కేవలం చట్టాల ద్వారా కాకుండా, తమ సొంత ఆస్తుల పారదర్శకతతో, తమ కుటుంబాల నైతిక ప్రవర్తనతో 'భగవద్గీత' చెప్పినట్లు ఆదర్శంగా నిలవాలి. ఏ సంస్కృతి, ఏ గ్రంథాల పేర్లనైతే నేటి రాజకీయాలు గట్టిగా వాడుకుంటున్నాయో, అవే గ్రంథాలు పాలకులకు వారి అసలు బాధ్యతను హెచ్చరిస్తున్నాయి.

?ఎండకు ఎండిపోయిన భూమి ఆకాశం వైపు వర్షం కోసం చూస్తున్నట్లుగా, దేశంలో కోట్లాది మంది సామాన్యులు ఇప్పటికీ ఆశగా ప్రభుత్వాల వైపు చూస్తున్నారు. నాయకత్వం నైతిక విలువలతో కూడిన 'రాజధర్మాన్ని' మరియు కఠినమైన 'దండనీతిని' పునరుద్ధరించనంత కాలం, ఆ సామాన్యుడి ఎదురుచూపులకు సమాధానం దొరకదు. న్యాయం అనే వర్షం కురుస్తుందా లేదా అనేది పాలకుల స్వీయ నైతికతపైనే ఆధారపడి ఉంది.



వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863

## నేరాల నియంత్రణకే కార్డెన్ సర్చ్ తనిఖీలు

.ముధోల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నియోజకవర్గ పరిధిలో నేరాల నియంత్రణకై నిరంతరం కార్డెన్ సర్చ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. నిర్మల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముధోల్ మండలంలోని ఎడ్బిడ్ తాండలో శుక్రవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా ప్రజలకు రక్షణ, భద్రత భావం కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 73 మోటార్ సైకిళ్లు, ఒక త్రీ వీలర్ వాహనాన్ని సీజ్ చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనాలకు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు బిట్ల పెర్సిస్, అశోక్, జుబేర్, ఏఎస్ఐలు యశ్వంత్, నర్సింగ్, భాను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలి

.ముధోల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలని ముధోల్ తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు భాస్కరోళ్ల లవణ్ కుమార్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, నకిలీ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రస్తుతం బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నందున ప్రజలు వారికి సరైన సమాచారం అందించాలన్నారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను పోల్చి వివరాలు నమోదు చేస్తున్నందున, ముఖ్యంగా వివాహమైన మహిళలు తమ పుట్టిన గ్రామంలోని తల్లిదండ్రుల వివరాలను బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పులు లేకుండా నింపాలన్నారు.



## ఆర్మూర్‌లో 14 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



.ఆర్మూర్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్ లో ఆర్మూర్ నియోజకవర్గ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమక్షంలో 14 లక్షల 41 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి డిశ్చార్జ్ అయిన తర్వాత తమ వైద్య బిల్లుల పత్రాలను నేరుగా ఆర్మూర్ లోని పీవీఆర్ భవన్ కు తీసుకువచ్చి సమర్పిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ ద్వారా త్వరితగతిన ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి అనారోగ్య బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమ్స్ ఆసుపత్రి సర్జరీ కొరకు ఎల్‌ఓసి అందజేత

ఆర్మూర్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణం 29వ వార్డు వాస్తవ్యులు అందె కవిత తీవ్ర హృద్రోగ సమస్యతో బాధపడుతూ అత్యవసర గుండె సర్జరీ నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి విన్నవించారు. దీనిపై వినయ్ కుమార్ రెడ్డి తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎల్‌ఓసి కొరకు నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ద్వారా ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రభుత్వ అనుమతితో మంజూరైన 2,50,000 (రెండు లక్షల యాభై వేల) రూపాయల విలువైన ఎల్‌ఓసి కాపీని శుక్రవారం రాత్రి ఆర్మూర్ లోని పీవీఆర్ భవన్ లో బాధిత కుటుంబ సభ్యులకు ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి స్వయంగా అందజేశారు. అత్యవసర సమయంలో పెద్ద మొత్తంలో ఎల్‌ఓసి కాపీ ఇప్పించి ఆదుకున్న ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి, ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## జులై 1న జరిగే నిరసనలను జయప్రదం చేయండి

నిర్మల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కార్మికుల, వ్యవసాయ కార్మికుల, రైతుల సమస్యల పరిష్కారం కొరకు జులై 1వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకుర్ తిరుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్మల్ లోని టీఎన్జీవోస్ భవన్ లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకువచ్చి నష్టం చేస్తోందని మండిపడ్డారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వి బి జి రామ్ జీ చట్టం జులై 1 నుండి అమలు కాబోతున్న నేపథ్యంలో ఈ నిరసనలకు పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో నాగుల నరస గౌడ్, తొడసం శంభు పాల్గొన్నారు.



## ముధోల్‌లో వైభవంగా పీర్ల పండుగ వేడుకలు

ముధోల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మండల కేంద్రమైన ముధోల్ లో పీర్ల పండుగ వేడుకలను శుక్రవారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఎంతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పీరీల బంగ్లా వద్ద పీర్ల ఊరేగింపు కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ముధోల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి పీరీలను దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. తమ కుటుంబాలు చల్లగా ఉండాలని కోరుకుంటూ భక్తులు నిప్పుల గుండం దాటి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు సాగినంత పొడవునా స్థానిక యువకులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహించారు.



## అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ విజేత గణరాజ్‌కు సన్మానం

ఆర్మూర్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఐరన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ 2026 పవర్‌లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో భారతీయ క్రీడాకారుడు డిలోడ్ గణరాజ్ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో ఏకంగా 195 కేజీల భారీ బరువును ఎత్తి మొదటి స్థానంతో బంగారు పతకాన్ని (స్వర్ణ పతకం) కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారతదేశ కీర్తిని, మన ప్రాంత గుర్తింపును దశదిశలా చాటిన డిలోడ్ గణరాజ్ ను శుక్రవారం రాత్రి బీజేపీ నేత బుస్సాపూర్ శంకర్ శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతకు గణరాజ్ సాధించిన అంతర్జాతీయ విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. గణరాజ్ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, దేశానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. దేశానికి, మన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన పవర్‌లిఫ్టర్ గణరాజ్ కు స్థానిక క్రీడాకారులు, యువకులు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించిన తహసీల్దార్

ఆర్మూర్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఆర్మూర్ పట్టణ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లలో సాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్మూర్ తహసీల్దార్ సత్యనారాయణ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల వివరాల నమోదు, ఫారాల పంపిణీకి సంబంధించి బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు), సూపర్‌వైజర్లకు తగు సూచనలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎంతో కీలకమైనదని, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని ఎలాంటి లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ వెంట ఆర్మూర్ ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్, మండల గిర్దావర్, సంబంధిత పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# పింఛన్ల వేట... అనర్హులకు సర్కార్ షాక్..

## నిర్మల్ జిల్లాలో 1.25 లక్షల మంది గుండెల్లో రైళ్లు!

నిర్మల్ జూన్ 26 తెలంగాణ వెన్నెల వాక్కు

సామాజిక భద్రత పింఛన్ల పేరిట ఖజానాకు కన్నం వేస్తున్న అనర్హుల ఆటకట్టించేందుకు ప్రభుత్వం ఉడుం పట్టు పట్టింది. 'చేయూత' పింఛన్ల లబ్ధిదారుల ప్రక్షాళన కార్యక్రమం నిర్మల్ జిల్లాలో ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరింది. అర్హులైన పేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ సొమ్ము, మరణించిన వారి పేరిట మరియు అనర్హుల ఖాతాల్లోకి వెళ్తుండటాన్ని సీరియస్‌గా తీసుకున్న సర్కార్, క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేతో ముసలం పుట్టించింది. ఈ జూన్ నెలాఖరుతో ఈ మహా సర్వే గడువు ముగియనుండటంతో, ఎక్కడ తమ పింఛన్ కట్ అవుతుందోనని లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.




గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేట మొదలుపెట్టారు. లోతుగా జరుపుతున్న ఈ విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. గతంలో మరణించిన వారి పేరిట కూడా కొందరు కేటుగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా పింఛన్ డబ్బులు డ్రా చేస్తూ ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నట్లు తేలింది. ఈ అక్రమాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు పోస్టాఫీసు పింఛన్దారులకు ప్రత్యేక యాప్ ద్వారా 'ఫేస్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) పరీక్ష పెడుతున్నారు. డిజిటల్ నిఘాతో దొంగచాటుగా డబ్బులు నొక్కేసే వారి గుట్టు రట్టవుతోంది. మృతుల తనిఖీలతో పింఛన్ల రూపంలో ప్రభుత్వ ధనం వృథా కాకుండా అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

తాజా ప్రభుత్వ అంచనాల ప్రకారం నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సుమారు ఒక లక్షా 25 వేల మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. లబ్ధిదారుల మరణాలు, కొత్తగా వచ్చే మంజూరీలు, అర్హతల్లో వచ్చే మార్పుల కారణంగా ఈ సంఖ్య ప్రతి నెలా కొంత మేర మారుతూ ఉంటుంది. జిల్లాలో అత్యధికంగా వృద్ధాప్య పింఛన్ల లబ్ధిదారులు ఉండగా, ఆ తర్వాత స్థానంలో వితంతువులు ఉన్నారు. జిల్లాలోని అంచనా వివరాల ప్రకారం సుమారు 75,000 నుండి 80,000 మంది వృద్ధులు, దాదాపు 25,000 నుండి 28,000 మంది వితంతువులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరితో పాటు సుమారు 11,000 నుండి 13,000 మంది దివ్యాంగులకు, 4,000 నుండి 5,000 మంది ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. అలాగే చేనేత, గీత కార్మికులు, కల్లుగీత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు తదితర ప్రత్యేక కేటగిరీల కింద సుమారు 5,000 నుండి 7,000 మందికి లబ్ధి చేకూరుతోంది. ఈ ప్రక్షాళనతో అనర్హుల జాబితా భారీగా తగ్గే అవకాశం కనిపిస్తోంది.

ప్రభుత్వం మారిన తర్వాత 'ప్రజాపాలన' సభల్లో కొత్త పింఛన్ల కోసం జిల్లావ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే పాత జాబితాలో ఉన్న అనర్హులు, మృతుల తేల్చకుండా కొత్త వారికి పింఛన్లు ఇవ్వడం సాధ్యం కాదని సర్కార్ తేల్చి చెప్పింది. దీంతో ఈ నెలాఖరుతో పాత సర్వే ముగిసి, నివేదికలు అందగానే జూలై నుండి కొత్త దరఖాస్తుల వడపోత షురూ కానుంది. ఎప్పుడెప్పుడు అనర్హుల ఏరివేత ముగుస్తుందా, తమకు పింఛన్ భాగ్యం కలుగుతుందా అని వేలాది మంది నిజమైన అర్హులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు

# ఊర పందుల స్వైర విహారం..

# ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులు

- బైక్‌ను ఢీకొట్టిన పందులు..
- యువకుడికి తీవ్ర గాయాలు
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
- పందులను వెంటనే తరలించాలని మరోసారి డిమాండ్



నిర్మల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

గ్రామంలో ఊర పందుల స్వైర విహారం రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న పందులు వాహనాలకు అడ్డుగా రావడం, ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను పాడు చేయడం, చెత్తాచెదారాన్ని చెల్లాచెదురు చేయడం, మురికి వాతావరణాన్ని సృష్టించడం వల్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో గ్రామంలోని బంజ ప్రభాకర్ ఇంటి సమీపంలో జరిగిన ప్రమాదం మరోసారి ఊర పందుల సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. బైక్‌పై వెళ్తున్న పీసరి బంజ సతీష్ అనే యువకుడికి ఒక్కసారిగా పందులు అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

గ్రామస్తుల కథనం ప్రకారం, గ్రామంలో వందల సంఖ్యలో పందులు స్వేచ్ఛగా తిరుగుతుండటంతో ప్రతి రోజు ప్రమాద భయం వెంటాడుతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవడానికి కూడా భయపడుతున్నారని చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పందులు ప్రధాన రహదారులపై గుంపులుగా తిరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పందుల కారణంగా గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త కుప్పలను తవ్వి రోడ్లపై చెల్లాచెదురు చేయడం, మురుగు కాలువల్లో తిరగడం, అనంతరం నివాస ప్రాంతాల్లో సంచరించడం వల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

అంతేకాకుండా పందులు ఇళ్లలోకి చొరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పాడు చేయడం, చిన్నపిల్లలను భయభ్రాంతులకు గురిచేయడం, కూరగాయల తోటలు, ఇంటి పరిసరాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంపులుగా సంచరించడం వల్ల ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది.

సమస్య తీవ్రత దృష్ట్యా గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఇటీవల పందుల కాపరులతో సమావేశం నిర్వహించి, పందులను గ్రామానికి దూరంగా ఉంచాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

గతంలో కూడా ఇదే సమస్యపై గ్రామస్తులు మండల కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, గ్రామంలో సంచరిస్తున్న పందులను వెంటనే తరలించాలని అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని వారు విమర్శిస్తున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో గ్రామ ప్రజలు మరోసారి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఇకనైనా స్పందించి గ్రామంలో స్వైర విహారం చేస్తున్న పందులను గుర్తించి తరలించాలని, పందుల యజమానులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకముందే శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసింది



నిర్మల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ లక్షల కోట్ల రూపాయల అప్పుల పాలు చేశారని ఆదివాసీ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అప్పుల పాలైన తెలంగాణ రాష్ట్రాన్ని ఆదుకుంటూ మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. రేవంత్ రెడ్డి మీద కేటీఆర్, హరీష్ రావు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని, పదేండ్ల కాలంలో కేసీఆర్ 8 లక్షల కోట్లు అప్పు చేసి చిప్ప మాత్రం కాంగ్రెస్ చేతికి ఇచ్చి పోయాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ చేసిన అప్పుకు ప్రతి నెల 6 వేల కోట్లు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు, 4 లక్షల 50 వేల మందికి ఇందిరమ్మ ఇళు , 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 45 లక్షల కుటుంబాలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఇస్తూ ఆర్థికంగా తీర్చిదిద్దారన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ, సన్న బియ్యం వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తూ పండించిన ప్రతి గింజను కొన్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తప్పుడు కూతలు కూస్తున్న విపక్ష నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## బాసర ఆలయ దొంగలను త్వరగా పట్టుకోవాలి

బాసర, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ పరిధిలోని మహంకాళి దేవి ఆభరణాలు గత మూడు రోజుల క్రితం దొంగతనానికి గురికావడం స్థానికంగా కలకలం రేపింది. ఈ దొంగతనానికి కారకులైన నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని బాసర విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) డిమాండ్ చేసింది. శుక్రవారం ఆలయ ఈఓ అంజన దేవిని కలిసి వీడీసీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. బాసర ఆలయంలో ఎన్నో ఏళ్లుగా విధుల్లో ఉండి భద్రతలో విఫలమైన హోంగార్డులను తక్షణమే బాధ్యతల నుండి తొలగించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దొంగతనం ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ పరిసరాల్లో నిఘా, కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాసర వీడీసీ అధ్యక్షుడు నూకం లింగరావు, కమిటీ సభ్యులు బల్గురి నర్సింగ్ రావు, ఓంకార్ దేశాయ్, సంజీవ్ పటేల్, గురప్పా శంకర్, అశోక్, ధావు రాజు, రత్నెల్లి రమేష్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



## ప్రజావాణి పిటిషన్ల పరిష్కారంపై ఎస్పీ సమీక్ష



నిర్మల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల పురోగతిపై జిల్లా ఎస్పీ డాక్టర్ జీ జానకి షర్మిల ఐపీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం (డీపో) నుండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్ఓలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ప్రత్యేకంగా సమీక్షించి వాటి విచారణను వేగవంతం చేయాలన్నారు. ప్రతి ప్రజావాణి పిటిషన్‌పై ఎప్పటికప్పుడు ఫాలోఅప్ నిర్వహించి బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కార్యక్రమం కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ




నిర్మల్, జూన్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి డాక్టర్ జీ జానకి షర్మిల ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, బెయిల్ కేసుల నిర్వహణ, రిసెప్షన్, మాల్ఖానా, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం సత్వరమే పరిష్కరించాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్‌చందా ఎస్ఐ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com